## CONSOLIDATED COVERAGE REPORT
**State of Working India - 2021**

**Nava Telangana**
**Date: 09 May 2021**

# 26న దేశవ్యాప్త ఆందోళన

**న్యూఢిల్లీ :** యావత్ దేశ మానవాళిని కబళిస్తున్న కరోనా మహమ్మారి రెండో దశని కట్టడి చేయడంలో కేంద్రంలోని మోడీ సర్కారు పూర్తిగా వైఫల్యంచెందిందని వక్తలు విమర్శించారు. సామాన్య ప్రజానీకం ప్రాణాలు కాపాడటంలో తన బాధ్యతని విస్మరించిందని ఆరోపించారు. కాగా, సాంప్రదాయ సాగు వ్యవస్థని సమాధి చేసే సాగు చట్టాల రద్దుకై, కరోనాపై పోరాటంలో దేశంలోని శ్రామికవర్గానికి అండగా నిలిచేందుకు 26న దేశవ్యాప్త నిరసనలకి సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ సంయుక్తంగా పిలుపునిచ్చినట్టు చెప్పారు. శనివారం ఆన్‌లైన్ వేదికగా సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ సంయుక్తంగా బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షవర్గంగా ఆయా సంఘాల అధ్యక్షులు హేమలత(సీఐటీయూ), అశోక్ దావలే(ఏఐకేఎస్), విజయ రాఘవన్(ఏఐఏడబ్ల్యూయూ) పాల్గొనగా ప్రధాన కార్యదర్శులు తపన్ సేన్, హన్నన్ మొల్ల, బి వెంకట్ ప్రధాన వక్తలుగా ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహమ్మారి కరోనా రెండో దశ కారణంగా సామూహిక వ్యాప్తితో దేశంలో భయంకర దుస్థితి ఏర్పడిందని తెలిపారు. మోడీ ప్రభుత్వ అసమర్థత కారణంగా రోజుకు దేశంలో నాలుగు లక్షల కేసులు నమోదు అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మొదటి దశతోనే సుమారు నాలుగు కోట్ల ఉద్యోగాలు కోల్పోయినట్టు ఐఎల్ఓ, అజీజ్ ప్రేమ్‌జీ వర్సిటీ పేర్కొందని గుర్తు చేశారు. 20 శాతం దేశ ప్రజానీకం కంటే ఎక్కువ మంది పని లేకుండా దుర్భర స్థితిగతులను గడుపుతున్నారని స్పష్టం చేశారు. కానీ, ఈ విషయాలను ఏమాత్రం పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం ప్రవర్తిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం కరోనా రోగులకు ఆక్సిజన్ కూడా అందించలేని స్థితిలో కేంద్రం ఉందని విమర్శించారు. మోడీ-షా ద్వయం కరోనా వైరస్ కంటే దారుణంగా దేశాన్ని పట్టి పీడిస్తున్నారని వివరించారు. బడా పెట్టుబడిదారీ అనుకూల విధానాల కారణంగా దేశంలో వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతిన్నదని వాపోయారు. దేశంలో రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయ సంక్షోభం తలెత్తిందన్నారు. రైతులు కూడా వ్యవసాయ కూలీలు... వలస కార్మికులుగా మారే దుస్థితి ఏర్పడిందన్నారు. దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వివరించారు. దేశానికి ఆహారం అందించే రైతన్న నేడు అప్పులు, ఆరోగ్య సమస్యల్లో కూరుకుపోతున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. మొదటి దశ కరోనా కంటే రెండో దశ కరోనాతో వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు అత్యంత విషమ పరిస్థితిని ఎదుర్కొ ంటున్నారు. వలస కార్మికులతో వీరంతా ఇబ్బందులు ఎదు ర్కొంటున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తనట్టు ప్రవర్తిం చడం దారుణం అన్నారు. దేశంలోని శ్రామిక వర్గమంతా ఐదు రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని వివరించారు. ఒకటి ఆరోగ్యపరమైన సమస్య అయితే, రెండోవది ఉపాధి కోల్పోవడం, మూడోవది ఆకలి కేకలు, నాలుగొవది విద్యా సంబంధిత సమస్యలు, ఐదోవది కుల వివక్షత అని చెప్పుకొచ్చారు. కరోనా రెండో దశతో టెస్టులు కూడా అనుకున్న రీతిలో జరగడం లేదు. టెస్టులు కోసం లైన్లలో దేశంలోని శ్రామికులంతా చెప్పులు, బ్యాగులను పెట్టి నిలుచోవలిసిన దుస్థితికి కేంద్ర ప్రభుత్వం పరిస్థితిని దిగజార్చిందని ధ్వజమెత్తారు. వ్యాక్సినైజేషన్‌కి ఆన్ లైన్ ప్రక్రియ పెట్టడమే తుగ్లక్ చర్యగా వక్తలు అభిప్రాయపడ్డారు. దేశంలోని కార్మికులు, రైతు కూలీలు, రైతులు ఆన్ లైన్‌లో ఏ విధంగా ఎన్‌రోల్ చేసుకుంటారో మోడీ సర్కారు సమాధానం చెప్పాలన్నారు. ఈ ప్రక్రియ పూర్తిగా గ్రామీణ ప్రజలను వ్యాక్సిన్‌కి దూరం చేయడమే అవుతుందని విమర్శించారు. ప్రభుత్వం చెబుతున్న లెక్కల కంటే మూడు రెట్ల మంది అధికంగా కరోనాతో చనిపోతున్న కేంద్రం మొద్ద నిద్ర వీడటం లేదని మండిపడ్డారు. మనిరేగాకి కేవలం లక్ష కోట్లు ఇచ్చి ఆ పథకాన్ని ఆపద కాలంలో పేద ప్రజానీకానికి అనుకున్న రీతిలో ఉపయోగం లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు లక్షల కోట్లు ఇస్తే పరిస్థితిలో కొంతమార్పు వచ్చేది వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. వలస కార్మికులు గ్రామాలకి వెళ్లారని, అందుచేత ప్రతి ఒక్కరికీ పది కేజీల బియ్యం, నెలకి రూ. 7,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆకలి చావులు కూడా జరుగుతాయని చెప్పుకొచ్చారు. కానీ, ఈ విధానాలు మోడీ సర్కారు అమలు చేసేందుకు ఒప్పుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో రెండే మోడల్ ప్రభుత్వాలు ఉన్నాయని అన్నారు. విఫలతకి నిదర్శనమైన నరేంద్ర మోడీ మోడల్ ఒకటి కాగా... మరొకటి సక్సెస్కి సింబాలిక్ అయిన కేరళ మోడల్ అన్నారు. మోడీ మోడల్‌లో నిర్లక్ష్యం రాజ్యం ఏలుతుంటే... కేరళ మోడల్‌లో కరోనాని కట్టడి చేయడంతో పాటు సామాన్య ప్రజానీకానికి ఆహార, ఆర్థిక ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం గుర్తు చేశారు. కాగా, సమావేశంలో పాల్గొన్న విజయరాఘవన్‌కి ఇటీవల కేరళలో లెఫ్ట్ ఫ్రంట్ గెలుపు నేపథ్యంలో వక్తలు, అధ్యక్షవర్గం ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.